

రేపు లోక్ అదాలత్

ఏసీసీ, మార్చి 14: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన, సెషన్స్ జడ్జి బోయశ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీ కుదుర్చుకోగలిగే క్రిమినల్, సివిల్, ఫ్యామిలీ, బ్యాంకు, ఇన్సూరెన్స్, మోటారు వాహనాల కేసులను పరిష్కరించేందుకు నాలుగు బెంచీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



ఇఫ్తార్ | 6:27
శుక్రవారం

సహర్ | 5:02
శనివారం

ఎస్టీపీపీలో కొత్త యూనిట్

- ప్రస్తుతం 1,200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి
- మరో 800 మెగావాట్ల యూనిట్‌కు త్వరలో టెండర్లు
- డిప్యూటీ సీఎం ప్రకటనతో ఊపందుకున్న పనులు
- ప్లాంటు విస్తరణతో కొత్త ఉద్యోగాలకు అవకాశం

మంచిర్యాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జైపూర్ మండలం పెగడపల్లి వద్ద ఉన్న సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్టీపీపీ)లో మరో యూనిట్ ప్రారంభానికి సన్నాహాలు జరుగుతున్నాయి. 134 సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ 2016 జనవరి నెలలో విద్యుత్ ఉత్పత్తి వైపు దృష్టి సారించింది. ఇందులో భాగంగా సొంత అవసరాలతో పాటు వ్యాపార దృష్టితో మొదట 600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ అనతికాలంలోనే మరో 600 యూనిట్లను విస్తరించి మొత్తం 1,200 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని సాధిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో నిరంతర విద్యుత్ సరఫరాలో ఎస్టీపీసీ ప్రధాన పాత్రను పోషిస్తోంది. తాను ఉత్పత్తి చేస్తున్న విద్యుత్ నుంచి సంస్థ 150 మెగావాట్లు మాత్రమే వినియోగించుకుంటుండగా, మిగితా 1050 మెగావాట్ల విద్యుత్‌ను జెన్‌కో ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి విక్రయిస్తోంది.

భూముల సేకరణ..

విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు సుమారుగా రెండు వేల ఎకరాల భూములను సంస్థ రైతుల నుంచి సేకరించింది. ఉత్పత్తిని సాధించడం కోసం ప్రధానంగా అవసరమైన బొగ్గు, నీరు అందుబాటులో ఉండడంతో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. 2015లో విద్యుత్ ఉత్పత్తిని సాధించాలనే లక్ష్యంతో 2011సంవత్సరంలో కాంట్రాక్టు అవార్డు చేయడంతో పాటు 2012 సంవత్సరంలో అభి వృద్ధి పనులను సంస్థ ప్రారంభించింది. రూ.7573 కోట్ల అంచనా వ్య యంతో (రెండు యూనిట్లు) 1200 మెగా వాట్ల విద్యుత్ ప్లాంట్ పను లు పూర్తి చేయగా మరో రూ.6,500 కోట్ల అంచనా వ్యయం తో మూడో యూనిట్ 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ ప్లాంట్ ఏర్పాటు చేసే లక్ష్యంతో త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది.

మూడో యూనిట్ ఏర్పాటుకు..

ఎస్టీపీపీలో మూడో యూనిట్ ఏర్పాటు చేసేందుకు త్వరలో పనులు ప్రారంభించనున్నారు. ఇప్పటికే 1,200 మెగావాట్ల ఉత్పత్తి జరుగుతుండగా, వందశాతం ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఏఎల్ఎఫ్) సాధిస్తూ దేశ వ్యాప్త రికార్డులు సృష్టిస్తోంది. గత ఐదేళ్లలో ఏకంగా 60వేల మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి రాష్ట్ర గ్రిడ్‌కు సరఫరా చేసింది. త్వరలో టెండర్లు నిర్వహించిన మూడో యూనిట్ పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నారు. కాగా ఎస్టీపీపీలో మరో యూనిట్‌ను విస్తరిస్తుండగా, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కూడా ఏర్పడనున్నాయి. ఇప్పటికే సంస్థలో సుమారు రెండు వేల వరకు శాశ్వత, తాత్కాలిక ఉద్యోగులు పని చేస్తున్నారు. మూడో యూనిట్ అవసరమైన మరో 1,200 వరకు కొత్త ఉద్యోగాలు కల్పించనున్నారు. నూతనంగా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను కూడా రాష్ట్ర అవసరాలకు విక్రయించనుంది.

రెండు, మూడు రోజుల్లో..

ఎస్టీపీపీలో ఏర్పాటు చేయదలిచిన మూడో యూనిట్ విద్యుత్ ఉత్పత్తి పనులకు రెండు, మూడు రోజుల్లో ఉప ముఖ్యమంత్రి, ఇంధనశాఖ మంత్రి భట్టి విక్రమార్క శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు పనులకు శంకుస్థాపన చేయను న్నట్లు మంత్రి ఈ నెల 12న హైదరాబాద్‌లో ప్రకటించారు. డిప్యూటీ సీఎం ప్రకటనతో సింగరేణి అధికారులు అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. శని, ఆదివారాల్లో డిప్యూటీ సీఎం చేతుల మీదుగా పనులకు శ్రీకారం చుట్టాలని అధికారులు భావిస్తున్నారు.

గోదావరి నీరు తరలింపు..

మొట్ట మొదటిసారిగా విద్యుత్ ప్లాంట్ నిర్మాణం చేపట్టిన పెగడపల్లి సింగరేణి పవర్ ప్రాజెక్టుకు అవసరమైన 3 టీఎంసీల నీటిని గోదావరి, ప్రాణహిత నదుల నుంచి తరలిస్తూ కరెంట్ ఉత్పత్తి చేస్తోంది. గోదావరి నది నుంచి షెట్‌పల్లి, గంగిపల్లి, ఎల్కంటి, పెగడపల్లి శివారుల మీదుగా ప్లాంట్ ఆవరణలో నిర్మించిన రిజర్వాయర్ వరకు పైప్‌లైన్ ఏర్పాటు చేసి నీటిని తరలిస్తున్నారు. మిగితా 2 టీఎంసీల నీటిని కోటపల్లి మండలం దేవులవాడ శివారు ప్రాణహిత నది నుంచి తరలించడం కోసం ఏర్పాట్లు చేశారు. అలాగే విద్యుత్ ఉత్పత్తికి అవసరమై బొగ్గును శ్రీరాంపూర్ ఓపెన్ కాస్టు నుంచి తరలించేందుకు సంస్థ ప్రత్యేక రైలుమార్గాన్ని కూడా ఏర్పాటు చేసింది.



జైపూర్ మండలం పెగడపల్లి శివారులో ఉన్న సింగరేణి పవర్ ప్లాంట్

● సంక్షిప్తం..

- ఏసీసీ: మంచిర్యాల మున్సిపాలిటీకి చెంది న షాపింగ్ కాంప్లెక్స్‌లలోని గదుల అద్దెలను లీజుకు తీసుకున్న వారు సకాలంలో చెల్లించాలని చైర్మన్ రావుల ఉప్పలయ్య కోరారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు.

\- మంచిర్యాల పట్టణంలోని ఏసీసీ 3 అంగన్‌వాడీ కేంద్రం టీచర్ ఎస్. పద్మ 2024 సంవత్సరానికి గాను ఉమెన్ అచీవర్స్ అవార్డు అందుకు న్నారు. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ వాకాటి కరుణ, డైరెక్టర్ క్రాంతి వెస్లీ చేతులమీదుగా ఆమె అవార్డును అందుకున్నారు.

- దండేపల్లి: పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటా నికి దండేపల్లిలో పద్మశాలి సంఘం భవనం వద్ద గురువారం పద్మశాలీలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు వడ్డెపల్లి దేవయ్య, అలిశెట్టి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

\- పదో తరగతి విద్యార్థులు ఆందోళన చెందకుండా పరీక్షలు బాగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని మాజీ వైస్ ఎంపీపీ, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు ఆకుల రాజేందర్ అన్నారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు టీమ్ లింగాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో లింగాపూర్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం పరీక్ష ప్యాడ్స్, పెన్నులను పంపిణీ చేశారు.

- శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ సీఐగా డి మోహన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. మోహన్ నిర్మల్ జిల్లా ఖానాపూర్ నుంచి శ్రీరాంపూర్‌కు వచ్చారు.

- మందమర్రిరూరల్: ఇటీవల మందమర్రి సీఐగా పదవీ బాధ్యతలు స్వీకరించిన శశిధర్‌రెడ్డిని, ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన రాజశేఖర్‌ను కాంగ్రెస్ నాయకులు గురువారం పోలీస్‌స్టేషన్‌లో సన్మానించారు.

- రామకృష్ణాపూర్ క్యాతన్‌పల్లి మున్సిపాలి టీలోని 2వ వార్డు జ్యోతి నగర్ చర్చి లైన్‌లో రూ. 2 లక్షల మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జంగం కల, వైస్‌చైర్మన్ విద్యాసాగర్‌రెడ్డి, కమిషనర్ మురళీకృష్ణ వార్డు కౌన్సిలర్ పుల్లూరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

- జన్నారం: ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కుస్రం నీలాదేవి అన్నారు. గురువారం ఆకస్మికంగా పాఠశాలలను తనిఖీ చేశారు.

- జైపూర్: గర్భిణులు, బాలింతలు తృణధాన్యాలను ఆహారంగా తీసుకోవడం అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత అన్నారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఇందారం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

- కన్నెపల్లి: మండలంలోని జన్కాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం1లో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని సీడీపీవో ఉమాదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు.

ఎన్నికల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 14: రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సెక్టార్ అధికారులు ఎన్నికల సంబంధిత ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్‌లు రాహుల్, మోతిలాల్, ఎల్ఏ ఆర్అండ్ఆర్ ప్రత్యేక ఉప పాలనాధికారి చంద్రకళతో కలిసి సెక్టార్ అధికారులు, పోలీసు అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రతి సెక్టార్ అధికారి పరిధిలో గరిష్ఠంగా కనీసం 3 నుంచి 12 పోలింగ్ కేంద్రాలు ఉంటాయని చెప్పారు. ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో కనీస మౌలిక సదుపాయాలు పరిశీలించాలన్నారు. ఏమైనా అవసరం ఉంటే సంబంధిత ఎన్నికల రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. సమావేశంలో ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

● పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టరేట్: జిల్లాలో ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహించే పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం జిల్లా అధికారులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు జిల్లాలో 52 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. 9,637 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణకు 52 మంది ముఖ్య పర్యవేక్షకులు, 52 మంది డిపార్టుమెంటల్ అధికారులు, నలుగురు సంరక్షకులు, 545 మంది ఇన్విజిలేటర్లను నియమించామని వివరించారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తుఏర్పాటు చేసి 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్షా కేంద్రం సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలని చెప్పారు. విద్యార్థులు సకాలంలో పరీక్షకేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో యాదయ్య, ఏసీసీ ప్రకాష్, డీపీవో వెంకటేశ్వర్‌రావు, మున్సిపల్ కమిషనర్‌లు, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు

బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి

- మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్




బెల్లంపల్లిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

బెల్లంపల్లి, మార్చి 14: బీఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని, మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బెల్లంపల్లి పట్టణంలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో గురువారం బెల్లంపల్లి, కాసిపేట మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశానికి ఆయన హాజరయ్యారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని చెప్పారు. ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. ఇప్పుడు సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పాలనలో మళ్లీ రాష్ట్రం వెనక్కినెట్టబడుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. అనంతరం కొప్పుల ఈశ్వర్‌ను దుర్గం చిన్నయ్య సన్మానించారు.

తాండూర్: కాంగ్రెస్ ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలకు బీఆర్ఎస్ నాయ కులు, కార్యకర్తలు భయపడాల్సిన అవసరం లేదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గురువారం బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అధ్యక్షతన తాండూర్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సుబ్బు దత్తుమూర్తి నివాసంలో నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రణయ్‌కుమార్, వైస్ ఎంపీపీ దాగం నారాయణ, మండల కోఆప్షన్ సభ్యుడు రెహమత్‌ఖాన్, రైతు సమన్వయ కో ఆర్డినేటర్ దత్తాత్రేయరావు, ఎంపీటీసీ మొగిలి శంకర్, నాయకులు పురుషోత్తం గౌడ్, రాంచదంర్, రాజన్న, గట్టు సంతోష్‌కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాసిపేట: కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం మోసపూరిత హామీలు ఇచ్చిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, కాసిపేట జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, వైస్ ఎంపీపీ విక్రమ్‌రావు, ఎంపీటీసీ కొంబత్తుల రాంచందర్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ రమణారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నీలరాంచందర్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో?



- పెద్దపల్లి ఎంపీ టికెట్ కోసం 29 మంది దరఖాస్తు
- అభ్యర్థి ఎంపికపై అధిష్ఠానం మల్లగుల్లాలు
- అభ్యర్థులను ప్రకటించిన బీఆర్ఎస్, బీజేపీలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయనున్న తమ అభ్యర్థులను బీఆర్ఎస్, బీజేపీలు ప్రకటించాయి. అయితే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఇంతవరకు తేల్చకపోవడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొన్నది. రాష్ట్రంలో పెద్దపల్లితో పాటు నాగర్‌కర్నూల్, వరంగల్ నియోజక వర్గాలను షెడ్యూల్ కులాలకు చెందిన వారికి రిజర్వు చేయడంతో కుల సమీకరణాల దృష్ట్యా ఏయే సామాజిక వర్గానికి ఈ మూడు నియోజక వర్గాల్లో అభ్యర్థులను ఎంపిక చేయాలనే విషయమై పార్టీ అధిష్ఠానం మల్లగుల్లాలు పడుతున్నది. టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారితో పాటు పలువురి నాయకుల పేరిట పార్టీ పరంగా క్షేత్రస్థాయిలో సర్వే కూడా చేయించినట్లు సమాచారం.

ఇప్పటికే ఇక్కడినుంచి పార్టీ టికెట్ ఆశించిన టీపీసీసీ కార్యదర్శి, నేతకాని సామాజిక వర్గానికి చెందిన గొమాసే శ్రీనివాస్ నేత తనకు టికెట్ రాదని గమనించి బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన మూడు రోజులకే బీజేపీ టికెట్ సాధించారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ మాల సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. ఇప్పటికే ఆయన ఆయా నియో జకవర్గాలు పర్యటిస్తూ పార్టీ నాయకులు, ప్రజాప్రతి నిధులను కలుస్తూ వస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ మాత్రం ఇప్పటివరకు అభ్యర్థిని ప్రకటించలేదు. పెద్దపల్లి టికెట్‌ను మాదిగ సామాజిక వర్గాని కి చెందిన వారికే ఇవ్వాలంటూ ఆ వర్గాల నుంచి డిమాం డ్లు వస్తున్నాయి. పలు వేదికల మీద నుంచి వాళ్ల గళం విప్పు తున్నారు. ఈనెల మొదటి వారంలో జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తు న డప్పుల ర్యాలీ నిర్వహించారు. తాజాగా పెద్దపల్లిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు.

● ఆశావహుల్లో ఉత్కంఠ..

మూడు మాసాల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసిన విషయం తెలిసిందే. దీంతో పార్టీ టికెట్ ఎవరికి వచ్చినా గెలుపు నల్లేరు మీద నడకేనని భావిస్తున్న ఆశావహులు టికెట్ కోసం పోటీ పడుతున్నారు. మాల సామాజిక వర్గానికి చెందిన గడ్డం వివేక్ తనయుడు గడ్డం వంశీకృష్ణ, నేతకాని సామాజిక వర్గానికి చెందిన సిట్టింగ్ ఎంపీ బొర్లకుంట వెంకటేష్ నేత, మాదిగ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపీ డాక్టర్ పి సుగుణకుమారి, పార్టీ నాయకులు ఊట్ల వరప్రసాద్, ఆసంపల్లి శ్రీనివాస్, గజ్జెల కాంతం, పెర్క శ్యామ్ తదితరులు టికెట్ కోసం పోటీ పడుతున్నారు. వరంగల్, నాగర్ కర్నూల్ నియోజకవర్గాల్లో ఏ సామాజిక వర్గానికి చెందిన వారికి టికెట్ ఇస్తారో, దానిని బట్టి ఇక్కడ అభ్యర్థిని ఎంపిక చేసే అవకాశాలున్నాయి. బీఆర్ఎస్‌కు చెందిన సిట్టింగ్ ఎంపీ బొర్లకుంట వెంకటేశ్ నేత ఆ పార్టీని వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న విషయం తెలిసిందే. ఆయన కూడా పార్టీ టికెట్ కోసం సీరియస్‌గా ప్రయత్నాలు చేస్తున్నారు.

గడ్డం వివేక్ తన కుమారుడికి టికెట్ ఇప్పించుకునేందుకు పార్టీ అధిష్ఠానంపై తీవ్ర ఒత్తిడి తీసుకవస్తున్నట్లు సమాచారం. వంశీకృష్ణకే టిక్కెట్ ఇచ్చే విషయమై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొగ్గు చూపుతున్నా రని ప్రచారం జరుగుతున్నది. పార్లమెంట్ ఇన్‌చార్జీ, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాత్రం మాజీ ఎంపీ సుగుణకుమారి అభ్యర్థిత్వంపై మొగ్గు చూపుతు న్నారని తెలుస్తున్నది. ఊట్ల వరప్రసాద్, ఆసంపెల్లి శ్రీనివాస్‌లు కూడా శ్రీధర్‌బాబు ఆశీస్సుల కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

ఎంపీ వెంకటేశ్ నేతకు టికెట్ ఇప్పించేందుకు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు పట్టుబడుతున్నట్లు సమాచారం. పెద్దపల్లి, రామగుండం, ధర్మపురి ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపించుకుంటామని అభ్యర్థిని ఎంపిక చేసే నిర్ణయాన్ని అధిష్ఠానానికే వదిలేసినట్లు తెలుస్తున్నది. అభ్యర్థి ఎవరనేది ఇప్పటి వరకు తేల్చకుండా పార్టీ అధిష్ఠానం జాప్యం చేస్తుండడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొన్నది.

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వివేక్‌వెంకటస్వామి

చెన్నూరు, మార్చి 14: చెన్నూరు నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలు ఏ చిన్న సమస్య ఉన్నా నేరుగా క్యాంపు కార్యాలయానికి వచ్చి వినతి పత్రం ఇవ్వాలని, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఇటీవల బియ్యం దందా చేసే వ్యక్తితో తనకు సంబంధాలు ఉన్నాయని కొంత మంది అసత్య ప్రచారం చేశారన్నారు. తనకు ఎవరితో సంబంధాలు లేవన్నారు. నియోజకవర్గంలో అక్రమ వ్యాపారాలు చేసే వారిని ఉక్కుపాదంతో అణిచివేస్తామని హెచ్చరించారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల ఓ పత్రిక విలేకరిపై జరిగిన దాడిని ఆయన ఖండించారు. దాడి చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. అంతకుముందు క్యాంపు కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వివేక్ సతీమణి సరోజ, తనయుడు వంశీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం అక్కెపల్లి గ్రామంలోని మాంతమ్మ దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి పెద్దపీట

మందమర్రిటౌన్: మందమర్రి మున్సిపాలిటీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని , ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి తెలిపారు. గురువారం పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలో ప్రభుత్వ ఎస్‌డీఎఫ్ నిధులు రూ. 2.21 కోట్లతో డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు , యువ నాయకుడు గడ్డం వంశీవివేక్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నోముల ఉపేందర్‌గౌడ్, నాయకులు సొత్కు సుదర్శన్, గుడ్ల రమేశ్ పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



మందమర్రిలో మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు

మందమర్రి టౌన్, మార్చి 14: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని రామగుండం సీపీ ఎం శ్రీనివాసులు అన్నారు. గురువారం ఆయన మందమర్రి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన సీసీ కెమెరాల పని తీరు, నేరాలతో పాటు రౌడీషీట్ల జాబితా, ఫిర్యాదుల స్వీకరణకు సంబంధించి సీఐని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో రికార్డులపై ఆరా తీశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ తర్వాత పోలీసులు అనుసరించాల్సిన విధులకు సంబంధించి వివరించామని చెప్పారు. కమిషనరేట్ పరిధిలోని స్టేషన్ల పరిశీలిస్తున్నానని వివరించారు. సమావేశంలో ఎస్సై రాజశేఖర్, రామకృష్ణాపూర్, దేవాపూర్, కాసిపేట ఎస్సైలు, తదితరులు పాల్గొన్నారు. కాగా పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను సందర్శించడానికి వచ్చిన రామగుండం సీపీ ఎం శ్రీనివాస్‌ను మందమర్రి జీఎం మనోహర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

బెల్లంపల్లి: తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌ను రామగుండం సీపీ శ్రీనివాసులు సందర్శించారు. పోలీసులకు తగు సూచనలు చేశారు.ఆయన వెంట ఏసీపీ రవికుమార్,రూరల్ సీఐ సయ్యద్ అఫ్జలుద్దీన్,వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య, టూ టౌన్ ఎస్సై రమేష్, తాళ్లగురిజాల ఎస్సై నరేష్ ఉన్నారు.

కాసిపేట: పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలని పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం కాసిపేట పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఐ శశిధర్‌రెడ్డి, కాసిపేట ఎస్సై ప్రవీణ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విలేకరులపై దాడులను అరికట్టాలి

మందమర్రి టౌన్, మార్చి 14: విలేకరులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని గురువారం రామగుండం సీపీ ఎం శ్రీనివాసులుకు మందమర్రి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చందు, గాండ్ల సంజీవ్, కోశాధికారి రాజ్ కుమార్, సంపత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించాలి

కోటపల్లి, మార్చి 14: పారిశుధ్య సిబ్బంది గ్రామాల్లో చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని సర్వాయిపేట, ఎసన్‌వాయి, సిర్సా గ్రామపంచా యతీలను గురువారం ఆయన పరిశీలించారు. స్థానిక అధికారులు, పంచా యతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి అక్తర్ మొహియొద్దీన్ పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

ఏసీసీ, మార్చి 14: జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. గురువారం జరిగిన సెకండ్ ఇయర్ పరీక్షకు జనరల్ విభాగంలో 5,500 మంది విద్యార్థులకు 5,266 మంది హాజరయ్యారు. ఒకేషనల్‌లో 851 మందికి 817 మంది హాజరయ్యారు. మొత్తం 6,351 మంది విద్యార్థులకు 6,083 మంది హాజరు కాగా 268 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 25 పరీక్ష కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈవో శైలజ తెలిపారు.

దండేపల్లి: దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 28నుంచి నిర్వహిస్తున్న ఇంటర్‌మీడియట్ వార్షిక పరీక్షలు గురువారం ముగిశాయి. చివరి రోజు విద్యార్థులు ఆత్మీయంగా పలుకరించుకున్నారు.

అభినవకాలనీలో చోరీ

నస్పూర్, మార్చి 14: నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధి లోని అభినవ కాలనీలో నివాసం ఉండే తాండూరుకు చెందిన హెడ్ కానిస్టేబుల్ స్వామిదాస్ ఇంట్లో దొంగలు పడ్డారు. ఊరు వెళ్ళి తిరిగి గురువారం వచ్చి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉండడంతో బాధితుడు పోలీసులకు సమా చారం ఇచ్చాడు. స్థానిక పోలీసులు వెళ్లి పరిశీలించి ఆధారాలను సేకరిం చారు. హెడ్ కానిస్టేబుల్ స్వామిదాస్ ఇంట్లో రెండున్నర తులాల బంగారు గొలుసు, రూ. 50 వేలు నగదు ఎత్తుకెళ్ళినట్లు సీసీసీ ఎస్సై రవికుమార్ తెలిపారు. అంతే కాకుండా పక్క ఇంట్లో ఉంటున్న కొమురయ్య ద్విచక్ర వాహనంను దొంగలు ఎత్తుకెళ్లినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నమని ఎస్సై రవికుమార్ తెలిపారు.

పట్టణ ఇన్‌స్పెక్టర్‌గా బన్సీలాల్

ఏసీసీ, మార్చి 14: మంచిర్యాల పట్టణ ఇన్‌స్పెక్టర్‌గా బన్సీలాల్‌ను నియమించారు. 2007 బ్యాచ్‌కు చెందిన బన్సీలాల్ ప్రస్తుతం శ్రీరాంపూర్‌సీఐగా విధులు నిర్వహి స్తున్నారు. గతంలో బన్సీలాల్ మంచిర్యాల సీసీఎస్ ఎస్సై గా పనిచేశారు. ఇక్కడ పనిచేసిన పట్టణ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌ను కరీంనగర్ సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో బన్సీలాల్‌ను నియమించారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

నెన్నెల, మార్చి 14: మైలారంలో నెలకొన్న తాగునీటి సమస్యను కాంగ్రెస్ నాయకులు పరిష్కరించారు. గత మూడు దశాబ్దాలుగా మైలారం గ్రామానికి మత్తడి వాగులోని బావి ద్వారా తాగునీరు అందిస్తున్నారు. ఎగువలో ప్రాజెక్టు నిర్మించడంతో వాగులో నీటి ప్రవాహం లేక ఏటా వేసవి కాలంలో బావి ఎండిపోతోంది. ఎండాకాలంలో వారు నీటి ఎద్దడితో ఇక్కట్ల పాలవుతున్నారు. ఎండలు ముదరడంతో ఎప్పటిలాగానే ఈసారి బావిలో నీరు అడుగంటింది. గ్రామస్థులు సమస్యను గొళ్లపల్లి ఎంపీటీసీ బొమ్మెన హరీష్‌గౌడ్‌కు చెప్పగా ఆయన ఎమ్మెల్యే గడ్డం వినోద్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గురువారం బావి ఉన్న ప్రాంతంలో నీరు పారేలాగా అర కిలోమీటరు కాలువ తవ్వించారు. నీటి పారకం రావడంతో బావిలో నీటి ఊట వస్తోందని ప్రజలు చెప్పారు. ఇక తమ గ్రామానికి సరిపడా తాగునీరు సరఫ రా అవుతుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి ఇబ్బందులు తీర్చిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హరీష్‌గౌడ్, శ్రీనివాస్, రాజాగౌడ్, మల్లాగౌడ్, లచ్చన్న, ప్రకాష్‌రావు, మహేష్, రమేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

కాసిపేట, మార్చి 14: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రిన్సిపాల్ రాథోడ్ రమేశ్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య, సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు పల్లె మల్లయ్య, వ్యక్తిత్వ వికాస నిపుణుడు మద్దినవేని అర్జున్, కారుకూరి లక్ష్మణ్ పాల్గొన్నారు.

జైపూర్: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థు లు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు శంకర్‌రావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఆలిస్ మాధుర్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీఎస్పీ పొత్తు.. రహస్యమేంటి?

» ఇమడలేకనే బీఆర్‌ఎస్ వీడుతున్నా: కోనేరు కోనప్ప

» మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



కాగజ్‌నగర్, మార్చి 14: బీఆర్ఎస్, బీఎస్పీతో పొత్తు పెట్టుకోవటం వెనుక రహస్య ఒప్పందం ఏంటని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనపై లేనిపోని ఆరోపణలు చేసి ఓడించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో బీఆర్ఎస్ జత కట్టడం ఇమడలేకనే ఆ పార్టీని వీడుతున్నట్టు ప్రకటించారు. గురువారం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సమక్షంలో కోనప్ప కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మునిసిపల్ చైర్‌పర్సన్ షహీన్ సుల్తానా, వైస్ చైర్మన్ రాజేందర్‌తోపాటు పలువురు ఎంపీపీలు, జెడ్పీటీసీలు కూడా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కోనప్ప మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్‌పై తనకు ఎలాంటి కోపం లేదన్నారు. తనకు ఎలాంటి పదవులు వద్దని, కేవలం సిర్పూరు నియోజకవర్గ అభివృద్ధి చాలని వ్యాఖ్యానించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ.. సిర్పూరు నియోజవర్గ సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

బీఆర్‌ఎస్‌కు పెద్దిరెడ్డి రాజీనామా

హుజూరాబాద్, హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తరువాత కీలక నేతలు పార్టీని వీడుతున్నారు. తాజాగా కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. తన ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా అధిష్ఠానం వ్యవహార శైలి ఉందని, అది నచ్చకనే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని ఆయన తెలిపారు. ఈ మేరకు గురువారం రాజీనామా లేఖను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పంపించారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, రాజకీయాలపై సుదీర్ఘ అనుభవం కలిగిన తనకు పార్టీలో సముచిత గౌరవం లభించలేదని పెద్దిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలు, అభిమానులతో మాట్లాడి భవిష్యత్తు కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తానన్నారు. కాగా ఆయన అధికార కాంగ్రెస్‌లో చేరతారని సమాచారం.

ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ముగ్గురు

మహబూబ్‌నగర్, మార్చి14: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారంతో ముగిసింది. ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి ముగ్గురు అభ్యర్థులు మాత్రమే పోటీలో నిలిచారు. మొత్తం 16మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలనలో ముగ్గురి దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. 10 మంది అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ నుంచి నవీన్‌కుమార్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి సుదర్శన్‌గౌడ్ బరిలో నిలిచారు. 28న ఎన్నిక జరగనుంది.

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన జానారెడ్డి

» రఘువీర్‌రెడ్డి విజయానికి సహకరించాలని విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న రఘువీర్‌రెడ్డి విజయం కోసం సహకరించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మాజీ మంత్రి జానారెడ్డి కోరారు. గురువారం బంజారాహిల్స్‌లోని మంత్రి నివాసానికి వెళ్లిన జానారెడ్డి తన కుమారుడు రఘువీర్‌రెడ్డిని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో తమ మధ్య ఉన్న అనుబంధాన్ని ఇరువురు నేతలు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రఘువీర్‌కు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని, ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని మంత్రి కోమటిరెడ్డి హామీ ఇచ్చారు.

ఆటోడ్రైవర్ల సమస్యలపై నిర్లక్ష్యం వీడాలి: హరీశ్

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆటో నడవడం లేదని మనస్తాపంతో నిజామాబాద్‌లో ఓ సోదరుడు తన భార్యతో సహా ప్రాణాలు తీసుకున్న హృదయ విదారక ఘటన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కదిలించకపోవడం బాధాకరమని గురువారం ఎక్స్(ట్విటర్) వేదికగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాధగా మారిన వారి బిడ్డ భవిష్యత్‌కు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఆ కుటుంబానికి వెంటనే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. అలాగే ఆటోడ్రైవర్ల జీవనసమస్యకు పరిష్కారం చూపాలని, వారికి రూ.12వేల భృతి ఇవ్వాలని హరీ్‌షరావు కోరారు. కాగా, డీఎస్సీ పరీక్షలకు ముందే టెట్ నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడం సంతోషకరమని మరో ట్వీట్‌లో హరీశ్ పేర్కొన్నారు.

డీకే శివకుమార్‌ను కలిసిన మల్లారెడ్డి

తనయుడితో కలిసి బెంగళూరుకు.. కర్ణాటక డిప్యూటీ సీఎంతో భేటీ

పార్టీ మారుతున్నారనే ఊహాగానాలు.. వ్యాపార లావాదేవీలేనన్న మల్లారెడ్డి

హైదరాబాద్/మేడ్చల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి గురువారం బెంగళూరులోని ఒక హోటల్లో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు కలిశారు. మల్లారెడ్డి తనయుడు భద్రారెడ్డి కూడా వెంట ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి పలువురు నేతలు కాంగ్రెస్‌లోకి చేరుతున్న నేపథ్యంలో మల్లారెడ్డి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. శుక్రవారం ఢిల్లీలో కాంగ్రెస్ ముఖ్యనేత ప్రియాంకగాంధీని కలిసేందుకు అవకాశం ఇప్పించమని మల్లారెడ్డి కుటుంబసభ్యులు డీకేను కోరినట్లు సమాచారం. గత వారమే మల్లారెడ్డి, అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి సీఎం సలహాదారు అయిన వేంనరేందర్‌రెడ్డితో భేటీ అయ్యారు. అప్పుడే ఇద్దరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని ప్రచారం జరిగింది. దాంతో కేటీఆర్ మల్లారెడ్డిని తన నివాసానికి పిలిపించుకుని మాట్లాడారు. తనకు కాంగ్రెస్‌లోకి వెళ్లే ఆలోచన లేదని మల్లారెడ్డి కేటీఆర్‌కు చెప్పారు. ఆ మాట చెప్పి వారం గడవక ముందే డీకే శివకుమార్‌తో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ మారుతున్నట్లు వచ్చిన ఆరోపణలను మల్లారెడ్డి ఖండించారు. తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానన్నారు. బెంగళూరుకు ఒక ఫంక్షన్‌కు వచ్చానని, అక్కడ ఒక ప్రైవేటు వర్సిటీ అమ్మకానికి ఉందని ఫ్రెండ్ చెబితే దాని కొనుగోలు గురించి మాట్లాడటానికి మధ్యవర్తి ద్వారా డీకే శివకుమార్‌ను కలిశానని తెలిపారు. , రాజకీయాలేవీ మాట్లాడలేదన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి 75 ఏళ్లు దాటుతాయని, ఆ ఎన్నికల్లో పోటీచేసే ఉద్దేశం తనకు లేదని స్పష్టం చేశారు. ఈ ఐదేళ్లు బీఆర్ఎస్‌లోనే ఉంటూ ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేస్తానని చెప్పారు. మల్లారెడ్డి డీకే శివకుమార్ దగ్గరే ఆగిపోకుండా ప్రియాంకగాంధీ అపాయింట్‌మెంట్ అడగడం ఊహాగానాలకు తావిస్తోంది. ఆస్తులను కాపాడుకోవడానికి కాంగ్రెస్‌లోకి వెళ్లడమే మార్గమని మల్లారెడ్డి భావిస్తున్నారని కాంగ్రెస్‌లోని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మల్లారెడ్డి రాకను మేడ్చల్ కాంగ్రెస్ నేతలు మైనంపల్లి హన్మంతరావు, సుధీర్ రెడ్డి, వజ్రేష్‌యాదవ్, హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్ వ్యతిరేకిస్తున్నారు. రేవంత్ సన్నిహితుడిని కలిసినా చేరిక పని కాకపోవడంతో మల్లారెడ్డి బెంగుళూరు వైపు నుంచి నరుక్కొస్తున్నారని భావిస్తున్నారు.

ఆపరేషన్ రేవంత్!

(మొదటిపేజీ తరువాయి)

తెలుస్తోంది. రేవంత్ ఆయన సహచర బృందం కదలికలను గుర్తించడంతో పాటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు డబ్బులు ఎక్కడినుంచి, ఏయే మార్గాల్లో, ఎవరెవరు సర్దుబాటు చేస్తున్నారు..? అనే వివరాలను ప్రణీత్ ట్యాపింగ్ చేశారు. ముఖ్యంగా ఎన్నికలకు కొద్ది నెలల ముందు నుంచి రేవంత్‌తో పాటు ఆయనకు అత్యంత సన్నిహితులు, సహకరించే అందరి ఫోన్‌లపైనా ట్యాపింగ్ కొనసాగినట్లు ఆధారాలు లభించినట్లు తెలిసింది. అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్ ఆదేశాల మేరకు నడుచుకున్న ప్రణీత్.. రాజకీయ నాయకులు, పోలీసులతో పాటు ప్రైవేటు వ్యక్తుల సహకారం కూడా తీసుకున్నారు. ఎక్కడికక్కడ తమకు అందుతున్న సమాచారం, ఫోన్ నంబర్ల ఆధారంగా ఎస్ఐబీ ప్రధాన కార్యాలయం, ఇతర వార్ రూంల నుంచి రోజుల వ్యవధిలోనే వందల ఫోన్‌ల ట్యాపింగ్‌కు పాల్పడ్డారు. హార్డ్ డిస్కుల ధ్వంసం, కీలక పత్రాల దహనం కేసు దర్యాప్తులో భాగంగా ప్రణీత్ ఫోన్‌లోని వాట్సాప్ చాటింగ్‌లను దర్యాప్తు అధికారులు పరిశీలించగా బీఆర్ఎస్ నేతలతో పాటు ప్రైవేటు వ్యక్తుల నుంచి వచ్చిన సందేశాలను పరిశీలించారు. ఎన్నికల్లో డబ్బులు ఎవరెవరి చేతులు మారుతున్నాయన్న సమాచారం గుర్తించి కట్టడి చేశారని స్పష్టమైంది. అరెస్టు సమయంలో ప్రణీత్ రావును ప్రాథమికంగా విచారించగా ఒక ఎస్పీ, ఎస్ఐబీ అప్పటి చీఫ్ ఆదేశాల మేరకే తాను, తన బృందం పనిచేసినట్లు వెల్లడించినట్లు తెలిసింది. ప్రణీత్‌ను కస్టడీకి తీసుకుని విచారించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఏడు రోజుల కస్టడీ కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా, ప్రణీత్‌రావు కేసుకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన దర్యాప్తుపై సీఎం రేవంత్ పోలీసు ఉన్నతాధికారుల నుంచి ఆరా తీసినట్లు సమాచారం. దీంతో వారు సమగ్ర నివేదిక అందించారని తెలిసింది. ప్రణీత్ వ్యవహారంలో వెలుగులోకి వచ్చిన వ్యక్తుల పేర్లు.. అనుసరించాల్సిన విధానాలపై సీఎంకు వివరించినట్లు సమాచారం. చట్ట వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేసినట్లు తెలిసింది.



ప్రణీత్‌రావు (ఫైల్)

ఉన్నతాధికారుల చుట్టూ ఉచ్చు

ప్రణీత్‌తో అంటకాగి కుట్రలో భాగస్వాములైన ఎస్ఐబీ అప్పటి ఉన్నతాధికారులను నేడో రేపో విచారించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పంజాగుట్ట పోలీసులు వారికి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఎన్నికల ముందు పనిచేసినవారిపై దృష్టిపెట్టినట్లు సమాచారం. కొన్ని నియోజకవర్గాల్లో అధికారులు వారి ఇళ్లలోనే ప్రత్యేక గదుల్లో (వార్ రూమ్‌లు) ఏర్పాట్లు చేసి, ట్యాపింగ్‌కు పాల్పడినట్లు గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీటిని సిద్ధం చేసిన ప్రణీత్‌కు పలువురు సహచరులూ సహకరించినట్లు తెలుస్తోంది. మూడు నియోజకవర్గాల్లో విజిలెన్స్‌లో పనిచేస్తున్న ఇద్దరు, ఎస్ఐబీ అధికారి ఇళ్లలో వార్ రూమ్‌లను ఏర్పాటు చేసి, ప్రముఖుల ఫోన్‌లను ట్యాప్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఎన్నికల సందర్భంగా ఓ పార్టీ నిధుల తరలింపులోనూ ప్రణీత్ కీలక పాత్ర పోషించారని అనుమానిస్తున్నారు. డబ్బు, బంగారం, వస్తువులను చేరవేసేందుకు సొంత, ఎస్ఐబీ, గ్రేహౌండ్స్ వాహనాలను వినియోగించారనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ప్రణీత్ ఫోన్ నుంచి కీలక వివరాలు సేకరించే పనిలో సైబర్ నిపుణులు ఉన్నారు. ఆయన తొలగించిన డేటాను రిట్రీవ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది బయటకు వస్తే మరింతమంది అరెస్టయ్యే అవకాశముందని చెబుతున్నారు. ఇప్పటికే ఎస్ఐబీ లాగర్ రూమ్‌లో పనిచేసిన ఇన్‌స్పెక్టర్, ఎస్సైలను విచారించారు.

ట్యాపింగ్ చేయమన్నది ఎవరు?

ట్యాపింగ్‌కు ఎవరు ప్రోత్సహించారు? ఎలాంటి సమాచారం సేకరించారు? ఎవరి పాత్ర ఎంత? అనే ప్రశ్నలకు ప్రవీణ్ స్పష్టంగా సమాధానం ఇచ్చారని తెలుస్తోంది. ఈ మేరకు పంజాగుట్ట పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డు చేసి, సాంకేతిక ఆధారాలను సేకరించారు. ప్రణీత్ ఫోన్ డేటా విశ్లేషించి, ఏయే నంబర్లతో ఎంత మందితో టచ్‌లో ఉన్నారో తెలుసుకున్నారు. ఎవరెవరి ఫోన్‌లు ఎంత కాలం ట్యాప్ చేశారు? తదితర అంశాలను దర్యాప్తు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వార్ రూమ్‌లకు ఈ డేటాను అందించినట్లు అంచనాకు వచ్చారు. డేటాను కాపీ చేసిన హార్డ్ డిస్కులు ఎక్కడున్నాయో దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక బ్యారెక్.. పకడ్బందీ భద్రత

ప్రణీత్‌ను విచారించి ఆధారాలు, సమాచారం రాబట్టేందుకు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ గురువారం నాంపల్లి కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రణీత్ న్యాయవాదులకు జడ్జి సూచించారు. శుక్రవారం వాదనలు జరిగే అవకాశముంది. కాగా, పోలీసుల అదుపులో ఉన్న ఆయనను బుధవారం రాత్రి చంచల్‌గూడ జైలుకు రిమాండ్‌కు తరలించారు. ప్రణీత్‌ను భద్రతా కారణాల దృష్ట్యా ప్రత్యేక బ్యారెక్‌లో ఉంచారు. సీసీ కెమెరా నిఘాతో పాటు నిరంతరం జైలు సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. అటువైపుగా ఇతర ఖైదీలను అనుమతించడం లేదు. గురువారం ఉదయం ప్రణీత్ తరఫు న్యాయవాది అనుదీప్, సోదరుడు వంశీ ములాఖాత్ అయ్యారు.

కాంగ్రెస్‌లోకి జితేందర్‌రెడ్డి!

(మొదటిపేజీ తరువాయి)

సీఎం రేవంత్‌రెడ్డి గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి జితేందర్ నివాసానికి వెళ్లి అరగంట పాటు సమావేశమయ్యారు. ఇది జితేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరబోతున్నారన్న ప్రచారానికి మరింత ఊతమిచ్చినట్టైంది. మరోవైపు ఈ పరిణామం మహబూబ్‌నగర్ జిల్లాలోనూ కలకలం రేపింది. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలి వరకు ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరిలో కాంగ్రెస్ నుంచి జితేందర్‌రెడ్డి పోటీ చేస్తారని పెద్దఎత్తున చర్చ జరిగింది. ఇక గురువారం సాయంత్రం మహబూబ్‌నగర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం వెళ్లి కలిశారంటేనే పార్టీలోకి ఆహ్వానించడానికి కాదా? అని వ్యాఖ్యానించారు. జితేందర్‌రెడ్డి మనస్తత్వం తనకు తెలుసని, ఎంపీగా రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కృషి చేశారని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి పనిచేస్తే బీజేపీ మోసం చేసిందని ఆరోపించారు.

ఎన్నికల్లో పోటీ చేయను..

తాను ఎన్నికల్లో పోటీ చేయడం లేదని జితేందర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. రేవంత్‌తోనూ ఎన్నికల్లో పోటీపై చర్చించలేదని స్పష్టంచేశారు. నిత్యం ప్రజల్లో ఉండే తనకు బీజేపీ టికెట్ రాకపోవడంతో సీఎం బాధపడ్డారని చెప్పారు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం చూసి రేవంత్‌రెడ్డి వచ్చినట్లు చెప్పారు. తన భవిష్యత్తును పార్టీ అధినాయకత్వమే చూసుకుంటుందని చెప్పారు. కాగా, జితేందర్‌రెడ్డికి ప్రధాని మోదీ, అమిత్‌షాతో సన్నిహిత సంబంధాలున్నాయి. అయితే, తనకు టికెట్ రాలేదని తెలిసి ఓదార్చేందుకే.. సొంత జిల్లా వాసి అయిన రేవంత్ వచ్చి కలిశారని చెప్పినా మహబూబ్‌నగర్ బీజేపీ, కాంగ్రెస్ వర్గాల్లో మాత్రం పార్టీ మార్పు ఊహాగానాలు పెద్దఎత్తున సాగాయి.

అరుణ ప్రెస్‌మీట్‌లో జితేందర్ కుమారుడు

మహబూబ్‌నగర్ బీజేపీ అభ్యర్థిగా డీకే అరుణ పేరును ప్రకటించాక జితేందర్‌రెడ్డి కుమారుడు మిథున్‌రెడ్డి ఆమె నివాసానికి వెళ్లి అభినందలు తెలిపారు. గురువారం జితేందర్ రెడ్డి నివాసానికి సీఎం రేవంత్ వెళతారని ప్రచారం జరుగుతున్న సమయంలోనే పాలమూరులో అరుణ మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులోనూ మిథున్‌రెడ్డి పాల్గొనడం గమనార్హం.

నేడు హైదరాబాద్‌కు ప్రధాని మోదీ

(మొదటిపేజీ తరువాయి)

పర్యటించనున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా రెండు రోజుల కిందట వచ్చి, సంస్థాగత బలోపేతంపై రాష్ట్ర పార్టీకి దిశానిర్దేశం చేశారు. బీజేపీ సోషల్ మీడియా వారియర్స్‌తో పాటు పార్టీ పోలింగ్ బూత్ అధ్యక్షులు, ఆ పైస్థాయి క్యాడర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బీజేపీ ముఖ్య నేతలతో భేటీ అయి పోలింగ్ బూత్‌ల పటిష్ఠత ఆవశ్యకతను వివరించారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ శుక్రవారం మరోసారి రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఆయన మూడు రోజుల పాటు పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయనున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు నగరంలో మోదీ రోడ్ షోను నిర్వహించినట్లుగానే ఈసారి కూడా బీజేపీ అదే విధంగా ప్లాన్ చేస్తోంది. మూడు పార్లమెంటు నియోజకవర్గాలకు కలిపి ఒక కేంద్రంలో ప్రధాని ఎన్నికల ప్రచారం కొనసాగించేలా రాష్ట్ర పార్టీ ప్రణాళిక రూపొందించింది. ఇందుకు అనుగుణంగా మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, హైదరాబాద్ సెగ్మెంట్లకు కలిపి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో జరిగే రోడ్ షోలో మోదీ పాల్గొంటారు. మీర్జాలగూడ నుంచి మల్కాజ్‌గిరి చౌరస్తా 1.3 కి.మీ మేర ఈ రోడ్ షోను భారీ ఎత్తున నిర్వహించేందుకు బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది. శుక్రవారం సాయంత్రం 4.50 గంటలకు ప్రధాని ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. 5 గంటల నుంచి 6 గంటల వరకు రోడ్ షోలో పాల్గొంటారు. మల్కాజ్‌గిరి చౌరస్తాలో ప్రసంగిస్తారు. అనంతరం, ప్రధాని రాజ్‌భవన్‌కు వెళ్లి బస చేస్తారు. శనివారం ఉదయం 11 గంటలకు బయలుదేరి నాగర్‌కర్నూలులో నిర్వహించే బహిరంగ సభకు హాజరవుతారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించి ఈ సభను ఏర్పాటుచేశారు. అనంతరం గుల్బర్గా బయలుదేరి వెళతారు. తిరిగి 18న జగిత్యాలలో నిర్వహించే బహిరంగ సభలో ప్రధాని పాల్గొంటారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ సెగ్మెంట్లకు సంబంధించి ఈ సభను ఏర్పాటు చేసినట్లు బీజేపీ వర్గాలు వివరించాయి.

రేవంత్‌కు అభద్రతా భావమెందుకు?: లక్ష్మణ్

కాంగ్రెస్‌కు మెజారిటీ ఎమ్మెల్యేలు ఉన్నప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు అభద్రతా భావంతో మాట్లాడుతున్నారని ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నించారు. ఎంపీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటుకు మార్గం సుగమమవుతుందని చెప్పారు. ఈ ప్రభుత్వం ఐదేళ్లు కొనసాగాలనే కోరుకుంటున్నామని.. కానీ నిలబెట్టుకోలేకపోతే వారి కర్మ అని అన్నారు. రాష్ట్రంలో 12కు పైగా స్థానాల్లో బీజేపీ విజయం ఖాయమని మాజీ ఎంపీ, చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఓటమికి, ఆ పార్టీ పతనానికి అహంకారమే కారణమని మాజీ ఎంపీ, బీజేపీ మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థి సీతారాం ఢిల్లీలో విమర్శించారు. ప్రజలే ఆ అహంకారాన్ని అణచివేశారని తెలిపారు.

పలు ప్రాజెక్టులకు అనుమతులు

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల నిర్మాణాలకు పరిపాలనపర అనుమతులు ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఖమ్మం జిల్లాలో మున్నేరు వాగుపై రూ.107.30 కోట్లతో ఆనకట్ట, నాగార్జున సాగర్ ఎడమకాలువపై రూ.35.75 కోట్లతో కొడుమూరు ఎత్తిపోతల పథకం రెండో దశ, కరీంనగర్ జిల్లాలోని కలువల వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి అనుమతి ఇచ్చింది.

తెలంగాణలో కాంగ్రెస్‌దే హవా!

17 లోక్‌సభ స్థానాల్లో 10 ఆ పార్టీ ఖాతాలోకే.. బీజేపీ-4, బీఆర్‌ఎస్-2, మజ్లిస్-1

» ఏపీలో టీడీపీ కూటమికి ఘన విజయం

» 25 సీట్లలో 20 గెల్చుకునే అవకాశం

» ఉత్తరాదిన మళ్లీ బీజేపీ ప్రభంజనం

» పలు రాష్ట్రాల్లో కమలం క్లీన్ స్వీప్!

» ఏబీపీ-సీఓటర్ సర్వే అంచనాలు

» తెలంగాణలో బీజేపీ 8 సీట్లు

గెలుస్తుందని నెట్‌వర్క్ 18 సర్వే వెల్లడి



న్యూఢిల్లీ, మార్చి 14: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ 10 స్థానాలను కైవసం చేసుకోనుందని ఏబీపీ- సీ ఓటర్ ఒపీనియన్ పోల్ అంచనా వేసింది. మొత్తం 17 స్థానాల్లో బీజేపీ 4, బీఆర్ఎస్ 2, ఎంఐఎం 1 స్థానం గెలవవచ్చని పేర్కొంది. కాగా, ఓట్ల విషయానికొస్తే.. కాంగ్రెస్ 43 శాతం, బీఆర్ఎస్ 28 శాతం, బీజేపీ 25 శాతం, ఎంఐఎం ఒక శాతం ఓట్లను దక్కించుకోవచ్చని ఈ సర్వే తెలిపింది. ఏపీలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి, వైసీపీ, కాంగ్రెస్‌ల మధ్య త్రిముఖ పోరు ఉంటుందని ఈ సర్వే వెల్లడించింది. మొత్తం 25 సీట్లలో టీడీపీ కూటమి 20 సీట్లను తమ ఖాతాలో వేసుకుంటుందని, వైసీపీ కేవలం 5 స్థానాలకే పరిమితమవుతుందని పేర్కొంది. ఓట్ల పరంగా కూటమికి 45 శాతం, వైసీపీకి 42 శాతం, కాంగ్రెస్‌కు 3 శాతం ఓట్లు లభిస్తాయని తెలియజేసింది. ఇతర రాష్ట్రాల విషయానికొస్తే ఈ సర్వే వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.


తమిళనాడులో డీఎంకే-కాంగ్రెస్ స్వీప్

కర్ణాటకలో బీజేపీ-జేడీఎస్ కూటమి 23 సీట్లను, కాంగ్రెస్ ఐదు సీట్లను దక్కించుకుంటాయి. తమిళనాడులో మొత్తం 39 సీట్లనూ డీఎంకే-కాంగ్రెస్ కూటమి స్వీప్ చేయనుంది. కేరళలో ఉన్న 20 సీట్లలో 16 సీట్లు కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ గెల్చుకోనుంది. మిగిలిన నాలుగు సీట్లు వామపక్ష (ఎల్‌డీఎఫ్) కూటమి కైవసం చేసుకుంటుంది. బీజేపీకి ఒక్క స్థానం కూడా దక్కే అవకాశం లేదు. ఇక దేశంలోనే అతిపెద్ద రాష్ట్రం, అత్యధికంగా 80 సీట్లను కలిగి ఉన్న యూపీలో ఈసారి కూడా బీజేపీ హవా వీయనుంది. 74 స్థానాలను ఆ పార్టీ సారథ్యంలోని ఎన్‌డీఏ కైవసం చేసుకుంటుంది. ఎస్పీ-కాంగ్రెస్‌లకు ఆరుకు మించి లభించే అవకాశాల్లేవు. బిహార్‌లో మొత్తం 40 స్థానాలకుగాను ఎన్‌డీఏ కూటమి 32 స్థానాల్లో విజయకేతనం ఎగురవేసే అవకాశం ఉంది. మిగిలిన ఎనిమిది సీట్లకే ఇండియా కూటమి పరిమితం కావచ్చు. పంజాబ్‌లో మొత్తం 13 స్థానాలుండగా, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఆమ్‌ఆద్మీ పార్టీ ఆరు స్థానాలను గెల్చుకునే అవకాశాలున్నాయి. కాంగ్రెస్ 5, బీజేపీ, అకాలీదళ్ చెరో స్థానాన్ని ఖాతాలో వేసుకోవచ్చు. 14 సీట్లున్న జార్ఖండ్‌లో 12 ఎన్‌డీఏ కూటమికి, రెండు ఇండియా కూటమికి లభించవచ్చు. దేశ రాజధాని ఢిల్లీలో మొత్తం ఏడు సీట్లనూ బీజేపీ మరోసారి హస్తగతం చేసుకోనుంది. హరియాణాలో 10 స్థానాలకుగాను బీజేపీ 8, కాంగ్రెస్ 2 స్థానాల్లో విజయం సాధించే అవకాశాలున్నాయి. గుజరాత్ (26), రాజస్థాన్ (25), హిమాచల్ ప్రదేశ్ (4)లను బీజేపీ పూర్తిగా క్లీన్‌స్వీప్ చేయనుంది. ఇక ఈశాన్య రాష్ట్రాల్లో ఉన్న 11 స్థానాల్లో 9 బీజేపీ ఖాతాలోనే పడతాయని ఏబీపీ సీ ఓటర్ సర్వే అంచనా వేసింది. కాగా, నెట్‌వర్క్ 18.. 'మెగా ఒపీనియన్ పోల్' పేరుతో తెలంగాణలో తమ సర్వే వివరాలను గురువారం వెల్లడించింది. ఈ సర్వే ప్రకారం.. రాష్ట్రంలోని 17 సీట్లలో బీజేపీ 8 కైవసం చేసుకుంటుంది. కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 2, ఎంఐఎం ఒక స్థానంలో గెలిచే అవకాశాలున్నాయి. అయితే, ఓట్ల పరంగా కాంగ్రెస్ అత్యధికంగా 34 శాతం ఓట్లను దక్కించుకుంటుందని, బీజేపీకి 28 శాతం, బీఆర్ఎస్‌కు 27 శాతం, ఇతరులకు 11 శాతం ఓట్లు లభిస్తాయని ఈ సర్వే పేర్కొంది.

మల్కాజిగిరిలో రాగిడి లక్ష్మారెడ్డి

ఆదిలాబాద్‌లో ఆత్రం సక్కు.. మరో రెండు ఎంపీ స్థానాలకు బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఖరారు చేసిన కేసీఆర్

హైదరాబాద్, ఆదిలాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బరిలోకి దిగనున్న మరో ఇద్దరు బీఆర్ఎస్ అభ్యర్థులను ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ గురువారం ప్రకటించారు. మల్కాజిగిరి ఎంపీ స్థానానికి రాగిడి లక్ష్మారెడ్డి, ఆదిలాబాద్ స్థానానికి ఆత్రం సక్కు అభ్యర్థిత్వాలను ఆయన ఖరారు చేశారు. ఇప్పటికే ప్రకటించిన వాటితో కలిపి ఇప్పటి వరకు 11లోక్‌సభ స్థానాలకు బీఆర్ఎస్ తమ అభ్యర్థులను ప్రకటించింది. ఉప్పల్ టికెట్ రాకపోవడంతో రాగిడి లక్ష్మారెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే. అయితే మల్కాజిగిరి స్థానం నుంచి పలువురి పేర్లు ప్రచారంలో ఉన్నప్పటికీ అనూహ్యంగా రాగిడి లక్ష్మారెడ్డి అభ్యర్థిత్వాన్ని ప్రకటించడంపై పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన నేతలతో నందినగర్‌లోని తన నివాసంలో కేసీఆర్ గురువారం భేటీ అయ్యారు. ఆదిలాబాద్‌లో పార్టీ అభ్యర్థి ఎవరన్నదానిపై నేతలతో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. ఈ క్రమంలో ఆదివాసీ ఉద్యమనేత, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు టికెట్ ఇవ్వాలని నిర్ణయించారు. సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ఆయనకు ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో అవకాశం ఇవ్వలేదు. అదేసమయంలో ఆయనకు లోక్‌సభకు అవకాశం ఇస్తామన్న అధినాయకత్వం హామీ మేరకు తాజాగా ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రకటించినట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలుపొందిన ఆత్రంసక్కు ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. అప్పటి నుంచి బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారు. ఇప్పటికే బీజేపీ పార్టీ ఆదివాసీ నేతను అభ్యర్థిగా ఖరారు చేయడం, కాంగ్రెస్‌పార్టీ ఆదివాసీ నేతను బరిలోకి దించేందుకు అవకాశం ఉండడంతో బీఆర్ఎస్ కూడా ఆదివాసీనేతకు అవకాశం కల్పించింది. పొత్తుల్లో భాగంగా ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీఎస్పీ పార్టీ అభ్యర్థి, జడ్పీ మాజీ చైర్మన్ సిడాంగణపతికి అవకాశం దక్కుతుందన్న ప్రచారం జరిగింది. కానీ ఆదిలాబాద్ జిల్లా బీఆర్ఎస్ నేతలంతా ఆత్రంసక్కు వైపే మొగ్గు చూపడంతో ఆయన అభ్యర్థిత్వాన్ని పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. కాగా గత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి ఓటమిపాలైన నగేశ్.. తనకు ఈసారి టికెట్ దక్కదని భావించి పార్టీని వీడి బీజేపీలో చేరారు. ఆయనకు ఆదిలాబాద్ టికెట్ ప్రకటించారు.



రాగిడి లక్ష్మారెడ్డి ఆత్రంసక్కు

నేటి నుంచి ఒంటిపూట బడులు

లింగాపూర్, మార్చి 14: నేటినుంచి ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నామని లింగాపూర్ మండల విద్యాధికారి కుడ్మెత సూధాకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతస్థాయి అధికారుల ఆదేశాల మేరకు ఎండాకాలం దృశ్యా నేటినుంచే ఒంటిపూటబడులు నిర్వహిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులందరూ ఉదయం 8గంటలకు పాఠశాలలు ప్రారంభించి మధ్యాహ్నం 12.30 వరకు నిర్వహించాలన్నారు. ప్రతిఉపాధ్యాయుడు సమయపాలన పాటించాలన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం 12.30గంటలకు పెట్టాలని సూచించారు.

ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా ఆత్రం సక్కు



ఆత్రం సక్కు

ఆసిఫాబాద్, మార్చి 14: ఆదిలాబాద్ లోక్‌సభ స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు పేరును అధిష్ఠానం ఖరారు చేసింది. ఈ మేరకు గురువారం పార్టీ అధినేత కేసీఆర్ ఆదిలాబాద్ ఎంపీ టికెట్‌ను ఆత్రం సక్కుకు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి 11స్థానాల్లో అభ్యర్థుల పేర్లను ఖరారు చేయగా ఆదిలాబాద్ ఎంపీ స్థానానికి ఆత్రం సక్కుకు అవకాశం దక్కింది. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎంపీ టికెట్ కోసం మాజీ ఎంపీ గెడం నగేష్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు పేర్లను పరిశీలనలో ఉంచగా ఇటీవల మాజీ ఎంపీ గెడం నగేష్ బీజేపీలో చేరారు. దీంతో బీజేపీ అధిష్ఠానం బీజేపీ అభ్యర్థిగా నగేష్ పేరును ప్రకటించింది. దీంతో ఆత్రం సక్కుకు లైన్ క్లియర్ అయింది. ఈ మేరకు ఆదిలాబాద్ ఎంపీ స్థానానికి అత్రం సక్కు పేరును బీఆర్ఎస్ ప్రకటించింది.

వ్యక్తిగత సమాచారం :

పేరు	: ఆత్రం సక్కు
భార్య పేరు	: తులసి, ఉపాధ్యాయురాలు
తల్లిదండ్రులు	: మాన్కుబాయి- రాజు
స్వగ్రామం	: లక్ష్మీపూర్, తిర్యాణి మండలం
ప్రస్తుత నివాసం	: ఆసిఫాబాద్
పుట్టిన తేదీ	: 02-03-1973
కులము	: గోండు
విద్యార్హతలు	: ఇంటర్
పిల్లలు	: ఆరుగురు(వినోద్,అంకిత్, అన్వేష్, దివ్యలక్ష్మి, హిమబిందు, జంగుబాయి)

రాజకీయ చరిత్ర : 1993లో ఉపాధ్యాయ వృత్తిలో చేరి తుడుందెబ్బ జిల్లా ప్రచారకార్యదర్శిగా, ఏపీటీఎఫ్ కార్యదర్శిగా డబ్ల్యూటీయూ జిల్లాఉపాధ్యక్షుడిగా, రాయిసెంటర్ సంయుక్త కార్యదర్శిగా పదువులు చేపట్టారు. గిరిజన ఉపాధ్యాయ సంఘాల్లో పనిచేసి 2008లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2009లో ఆసిఫాబాద్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్‌పార్టీ నుంచి పోటీచేసి బీఆర్ఎస్ అభ్యర్థి పెందూర్ గోపిపై గెలుపొందారు. 2014ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి బీఆర్ఎస్ చేతిలో ఓటమి పాలయ్యారు. 2018ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీ నుంచి బరిలో నిలిచి బీఆర్ఎస్ అభ్యర్థి కోవలక్ష్మిపై గెలుపొందారు. అనంతరం కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. 2023ఎన్నికలలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన ఆత్రం సక్కుకు బదులుగా జడ్పీ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్న కోవ లక్ష్మికి టికెట్ కేటాయించారు. అప్పుడే ఆదిలాబాద్ ఎంపీ స్థానం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఆహామీమేరకు 2024లోక్‌సభ ఎన్నికలలో ఆదిలాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆత్రం సక్కు పేరును ప్రకటించింది.

'ఇందిరమ్మ' ఎవరికి దక్కేనో?

- జిల్లాలో 1,54,141 దరఖాస్తులు
- గత సర్కారు హయాంలోనూ దరఖాస్తు చేసుకున్న పేదలు
- ఎట్టకేలకు 'ఇందిరమ్మ' ఇళ్ల పథకానికి ప్రభుత్వం శ్రీకారం



ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 14: ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం సుమారు పదేళ్లు నిరీక్షించిన పేదల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. సొంతింటికలను సాకారం చేసుకునేం దుకు అర్హులు సిద్ధమవుతున్నారు. ఆరు గ్యారంటీల్లో ఒకటైన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం భద్రాచలంలో ప్రారం భించారు. ఈ నేపథ్యంలో అర్హులైన పేదలు మళ్లీ కొత్తగా దరఖాస్తులు చేసుకునేందుకు మార్గదర్శకాలను తెలుసుకుంటున్నారు. కొంతమంది మండల కార్యాలయాలకు వెళ్లి అధికారులను సంప్రదిస్తున్నారు. డబుల్ బెడ్‌రూం ఇల్లు పొందలేకపోయిన నిరుపేదలు 'ఇందిరమ్మ' పథకం ద్వారానైనా సొంతింటి కలను నేరవేర్చుకోవాలని ఉబలాటపడుతున్నారు.

బీపీఎల్‌లో ఉంటేనే అర్హత..

ఇందిరమ్మ పథకంపై పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు అందాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వహయాంలో వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకొని పరిశీలిస్తారా? కొత్తగా మళ్లీ దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందా? అనేవిషయమై ఇప్పుడే తామేమి చెప్పలేమన్నారు. కాగా 2023 అక్టోబరు నాటికి లక్షకు పైగా దరఖాస్తు చేసుకొన్నారు. తాజాగా ప్రభుత్వం అరు గ్యారంటీల పథకం ద్వారా ఇందిరమ్మ ఇళ్లకోసం 151141మంది దరఖాస్తులు చేసుకున్నారు. అర్హు లైన వారినే ఈ పథకం ద్వారా ఎంపిక చేస్తామని సీఎం ప్రకటించిన నేపథ్యంలో అధికారులు సైతం ఆచితూచి వ్యవహ రించే ధోరణితో ఉన్నారు. ఇందిరమ్మ స్కీంకు కూడా కలెక్టర్‌లే నోడల్ అధికారులుగా ఎంపిక చేసే అవకాశం ఉందంటున్నారు. మండల పరిధిలో ఎంపీడీవోల ఆధ్వర్యంలో, మున్సిపాలిటీల్లో పట్టణ ప్రణాళిక అధికారి, ఆర్‌ఐల ఆధ్వర్యంలో పరిశీలన చేయనున్నారు. సొంత స్థలం ఉందా? బీపీఎల్ పరిధిలో ఉన్నారా? లేదా? గ్రామం లోని ఓటు హక్కు ఉన్నట్లు గుర్తింపు ఉందా? ప్రస్తు తం ఉంటున్న ఇల్లు ఎవరిది? తదితర వాటిని పరిగణలోకి తీసుకొని ఎంపిక చేయనున్నట్లు సమాచారం.

1,54,141 దరఖాస్తులు

ఇందిరమ్మ ఇళ్ల కోసం గత డిసెంబరు 28నుంచి జనవరి 6వరకు అయిదు గ్యారంటీ పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. జిల్లాలో సొంతింటి కోసం 1,54,141కుటుంబాలు దరఖాస్తు లు చేసుకున్నాయి. వీరిలో ఎంతమంది అర్హులో అధికా రులు గుర్తించాల్సి ఉంది. ఇంతవరకు బాగున్నా ఏటా నియోజక వర్గానికి 3,500 చొప్పున ఇళ్లను మంజూరు చేస్తామని ప్రకటించారు. జిల్లాలో రెండు నియోజక వర్గాల్లో ఏటా ఏడువేల ఇళ్లు మంజూరు అవుతాయి. వచ్చిన దరఖాస్తులు చూస్తే 1.50లక్షలకు పైగా ఉన్నాయి. వీరిలో కనీసం సగం మందే అర్హులనుకున్నా వీరందిరికీ రావాలంటే కనీసం పదేళ్లు పడుతుంది.

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి..

: జ్యోతి, ఆసిఫాబాద్



సొంతిల్లు లేక కిరాయి ఇంట్లో ఉంటు న్నాం. ఫ్యాన్సీ స్టోర్‌లో పని చేస్తున్నాను. వచ్చిన వేతనంలో సగం ఇంటి కిరాయికే వెచ్చించాల్సి వస్తోంది. గత ప్రభుత్వంలో గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు పెట్టుకు న్నా మంజూరు కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లుతోపాటు స్థలం కూడా కేటాయించాలి.

ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నాం

- ఆరుగ్యారంటీల అమలు జరగటం తథ్యం
- నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం
- మాజీ ఎమ్మెల్యే కోనప్ప చేరికతో కాంగ్రెస్‌కు బలం
- సిర్పూరు నియోజకవర్గ సమస్యలను పరిష్కరిస్తా
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క



కోనప్పను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి సీతక్క

కాగజ్‌నగర్ , మార్చి 14: ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను అమలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ అన్ని విధాల కృషి చేస్తోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. గురువారం కాగజ్‌నగర్ వినయ్‌గార్డెన్‌లో సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కాంగ్రెస్ పార్టీలో చేరిక సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు జేసిందన్నారు. గడీల పాలన బద్దలు కొట్టి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రానికి న్యాయం చేస్తోంది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. ఎన్నికల సమయంలో ఆరుగ్యారంటీల పథకాన్ని అమలు చేస్తామని చెప్పామని.. దానిని దశల వారీగా అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నట్టు తెలిపారు. పేద ప్రజల కోసం ప్రాణ త్యాగాలు చేసిన ఇందిరమ్మ కుటుంబానికి రానున్న ఎంపీ ఎన్నికల్లో పట్టం కట్టాలన్నారు. దేవుళ్లతో రాజకీయం చేసే పార్టీ బీజేపీ అన్నారు. ఈ రాజకీయానికి చెక్‌పెట్టాలంటే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఎన్నికల కోడ్ రాక ముందే మరిన్ని నిధులు కేటాయించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రతి ఒక్కరిని కలుపుకొని పోయేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందన్నారు. నియోజకవర్గానికి 3500 ఇళ్లు కట్టించేందుకు రాష్ట్ర సీఎం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. ఇందిరమ్మ రాజ్యం నిరుపేదల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. సిర్పూరు నియోజవర్గ సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామన్నారు. డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో గెలుపొందేందుకు అంతాకృషిచేయాలన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు మాట్లాడుతూ నిరుపేదలకు న్యాయం కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. ఈసారి జరిగే ఎంపీ ఎన్నికల్లో తప్పకుండా కాంగ్రెస్‌ను ఆదరించాలన్నారు. సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జీ రావి శ్రీనివాస్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కోనప్ప చేరికతో కాంగ్రెస్‌పార్టీకి బలం చేకూరినట్టు ప్రకటించారు.

కాంగ్రెస్‌లో చేరిన కోనేరు కోనప్ప..

బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పను గురువారం మంత్రి సీతక్క కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించింది. అలాగే జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మున్సిపల్ చైర్మన్ షహీన్ సుల్తానా, వైస్ చైర్మన్ రాజేందర్‌తోపాటు ఎంపీపీలు, జడ్పీటీసీలు కూడా చేరారు. ఈ సందర్భంగా మాజీఎమ్మెల్యే కోనప్ప మాట్లాడుతూ బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తు కలువటంతోనే తాను, కార్యకర్తలు పార్టీని వీడినట్టు తెలిపారు. తాను సీఎం రేవంత్‌రెడ్డితో కలిసిన సందర్భంలో తానుఎలాంటి పదవిని ఆశించనని కేవలం సిర్పూరు నియోజకవర్గం అభివృద్ధి ఉంటే సరి పోతుందని చెప్పినట్టు తెలిపారు.

అందవెల్లి బ్రిడ్జి పరిశీలన..

కాగజ్‌నగర్ అందవెల్లి బ్రిడ్జిన మంత్రి సీతక్క పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పరిస్థితి ఏంటి? తదితర అంశాలను మాజీ ఎమ్మెల్యే కోనప్పను అడిగి తెలుసుకున్నారు. పనులు ఆగి పోవటంతో 44 గ్రామాలకు రాక పోకలు నిలిచినట్టు మాజీ ఎమ్మెల్యే వివరించారు. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని సీతక్క ప్రకటించారు. అలాగే సిర్పూరు నియోజకవర్గంలోని సమస్యలను మంత్రి దృష్టికి కోనప్ప తీసుకవచ్చారు. తప్పకుండా దశల వారిగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. హైదరాబాద్ నుంచి రోడ్డు ద్వారా కాగజ్‌నగర్‌కు వచ్చిన సందర్భంగా చెక్‌పోస్టు వద్ద డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీఎమ్మెల్యే కోనప్ప, జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావుతోపాటు నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు.

సంక్షిప్త సమాచారం..

ఆసిఫాబాద్: రాష్ట్రమంత్రి సీతక్క శుక్రవారం ఆసిఫాబాద్ నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు తెలిపారు. ఉదయం 7:15గంటలకు నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనం ప్రారంభిస్తారు. తర్వాత గుండి వంతెనపనులు పరిశీలిస్తారు. అనంతరం కాంగ్రెస్‌పార్టీలో వివిధపార్టీల నాయకులచేరిక కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం ఇక్కడినుంచి కెరమెరి మండలం జోడేఘాట్‌లో పర్యటించనున్నట్లు అయన తెలిపారు.

-అధికసాంద్రత పత్తిసాగుపై వ్యవసాయ అధికారులు అవగాహన పెంచుకోవాలని జిల్లావ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. పట్టణంలోని జన్కాపూర్ రైతువేదికలో బెల్లంపల్లి కృషివిజ్ఞానకేంద్రం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్, సిర్పూర్(యూ) డివిజన్ పరిధిలలోని వ్యవసాయఅధికారులకు వచ్చే వానాకాలంలో అధికసాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆసిఫాబాద్‌రూరల్: పట్టణంలోనిఅర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలకు మంచిర్యాలజిల్లా తాండూరు మండలానికి చెందిన విద్యాభారతి బలగం సొసైటీ ఆధ్వర్యంలో రూ.9,500విలువ చేసే మార్చ్‌ఫాస్ట్ బ్యాండ్‌ను డీఈవో అశోక్ చేతుల మీదుగా అందజేశారు.

బెజ్జూరు: గ్రామపంచాయతీలకు నిధులు సమకూరినప్పుడే అభివృద్ధి చెందుతాయని ఎంపీవో రమేష్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయనఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

-మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలో గురువారంరాత్రి పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా జరిగింది. మండల విద్యాధికారి రమేష్‌బాబు, పాఠశాల ప్రత్యేకాధికారి అరుణతో కలిసి జ్యోతిప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

వాంకిడి: మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో చదువుకుంటున్న పదవతరగతి విద్యార్థులకు గురువారం పీఆర్టీయూ మండలశాఖ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు.

-మండలంలోని పిప్పర్‌గోంది గ్రామంలో గురువారం సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్‌పార్టీ మండలఅధ్యక్షుడు గుర్నులే నారాయణ ప్రారంభించారు.

జైనూర్: మండలంలోని జాంగూడ, లెండిగూడ, గౌరీ కోలంగూడ తదితర గ్రామాల్లో గురువారం గిరిజనులకు కంటివైద్యశిబిరాలు ఏర్పాటు చేసినట్లు ఏఎస్సై ఆడేఉమేష్, హెల్త్‌సూపర్వైజర్ పవర్ దిలీప్‌కుమార్ తెలిపారు.

సిర్పూర్(యు): సీఎంరేవంత్‌రెడ్డి కుమరంభీం ఆదివాసీకార్పొరేషన్ ఏర్పాటుచేయడంపై కాంగ్రెస్‌పార్టీ జిల్లా చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్ రావు హర్షం వ్యక్తం చేశారు.

కాగజ్‌నగర్ టౌన్: ఎస్పీఎంమిల్లు, భారతీయ యువశక్తిఆధ్వర్యంలో యువతకువ్యాపారరంగంలో అవకాశాలు కల్పించేందుకు సేవాకార్యక్రమాలు చేపడుతున్నట్టు భారతీయ యువశక్తి ట్రస్టు ప్రతినిధి గిరి తెలిపారు.

విద్యాసంవత్సరానికి ముందే పాఠశాలలను సిద్ధం చేయాలి



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ఆసిఫాబాద్, మార్చి 14: విద్యాసంవత్సరం 2024-25 ప్రారంభానికి ముందే అన్ని పాఠశాలలను పూర్తిస్థాయి సౌకర్యలతో సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి అన్నారు. గురువారం విద్యాశాఖ కార్యదర్శితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాకలెక్టర్లు, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈవిద్యాసంవత్సరం ముగింపు అనంతరం వేసవి సెలవులు 45రోజులపాటు ఉంటాయన్నారు. ఈక్రమంలో పాఠశాలల్లో అవసరమైన మరమ్మతులు చేయడంతోపాటు సౌకర్యాలను పూర్తిస్థాయిలో ఏర్పాటుచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ సకాలంలో జరిగే విధంగా ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. సమావేశంలో సీపీవో నరేందర్, డీఆర్డీవో సురేందర్, డీఈవో అశోక్, జిల్లా సంక్షేమశాఖల అధికారులు సజీవన్, రమాదేవి పాల్గొన్నారు.

కేసీఆర్‌ను పరామర్శించిన జిల్లా నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 14: మాజీముఖ్యమంత్రి కేసీఆర్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గురువారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు, బీఆర్ఎస్ రాష్ట్ర సహాయకార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావు, నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ఆయనదృష్టికి తీసుకువెళ్లారు. ఈసందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో ఆసిఫాబాద్ ఎంపీపీ మల్లిఖార్జున్, సింగిల్‌విండో చైర్మన్ అలీబీన్ అహ్మద్, బీఆర్ఎస్ నాయకులు అబ్దుల్లా, గంధం శ్రీనివాస్, నిసార్, అహ్మద్, సుంకరి పెంటయ్య తదితరులు ఉన్నారు.



కేసీఆర్‌కు పుష్పగుచ్చం అందజేస్తున్న అరిగెల నాగేశ్వర్‌రావు

ఆధునిక హంగులతో ముస్తాబైన గ్రంథాలయం

- నేడు ప్రారంభించనున్న మంత్రి సీతక్క



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మార్చి 14: జిల్లాకేంద్రంలో రూ.1.50కోట్ల రూర్బన్ నిధులతో ఆదునికహంగులతో జిల్లాశాఖ గ్రంథాలయం ముస్తాబైంది. శుక్రవారం ఈ గ్రంథాలయాన్ని రాష్ట్రపంచాయతీరాజ్, జిల్లా ఇన్‌చార్జీ మంత్రిసీతక్క ప్రారంభించనున్నారు. ఇందుకోసం అధికారులు అన్నిఏర్పాట్లు చేయగా కలెక్టర్ పరిశీలిం చారు. గ్రంథాలయ భవనాన్ని జీ ప్లస్‌వన్‌లో నిర్మించగా గ్రౌండ్‌ఫ్లోర్‌లో రీడింగ్, రైటింగ్ ఫర్నీచర్‌తో కూడిన మూడు విశాలమైన హాల్స్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయం, చైర్మన్ చాంబర్, సిబ్బంది గది, టాయిలెట్స్ నిర్మించారు. మొదటి అంతస్తులో మహిళలకు, పురుషులకు విడివిడిగా విశాలమైన రీడింగ్, రైటింగ్‌హాల్స్‌ను ఏర్పాటు చేశారు. రూ.5లక్షల నిధులతో పుస్తకాలను కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచారు.



సింగరేణిలో బీసీ ఉద్యోగుల సంబరాలు

శ్రీరాంపూర్, మార్చి 14: సింగరేణిలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగులు గురువారం సంబరాలు చేసుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన గెస్ట్‌హౌస్ శంకుస్థాపన సందర్భంగా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బీసీలైజన్ ఆఫీసర్‌ను నియమించాలని సింగరేణి సీఎండీ బలరాంకు ఆదేశాలు జారీచేయడం ఆనందంగా ఉందని శ్రీరాంపూర్ ఓసీపీ బీసీఉద్యోగులు పేర్కొన్నారు. ఓసీపీ ఆవరణలో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసుకొని అందరికీ మిఠాయిలు పంచిపెట్టారు. డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వివిధయూనియన్ల నాయకులు ఎస్‌కె బాజీసైదా, బరపటి మారుతి, చంద్రమోహన్, గండి సతీష్, జాన్సన్, కందుల శంకర్, సురేష్, జగన్, తదితరులు పాల్గొన్నారు.

మూతపడిన గనుల పరిశీలన

బెల్లంపల్లి, మార్చి 14: బెల్లంపల్లి ఏరియాలో మూతపడిన గనులను గురువారం ఐఐఈఎస్‌టీ శిబ్‌పూర్, కోల్‌కతా ప్రొఫెసర్ డాక్టర్‌సుదీప్తా మహోపాధ్యాయ్ కార్పొరేట్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. మొదట జీఎం కార్యాలయంలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మూతపడిన గనులను పరిశీలించారు. అనంతరం మూతపడ్డ ఎంవీకే1,5, బోయపల్లిగనులను పరిశీలించారు. ఆయనవెంట జీఎం రవిప్రసాద్, ప్రాజెక్టుఅధికారి ఉమాకాంత్, అధికారులు వెంకటరమణ, నరేష్, కృష్ణమూర్తి, మహేష్ తదితరులు ఉన్నారు.

ఉపరితల గనుల్లో వసతులు కల్పించాలి

శ్రీరాంపూర్, మార్చి 14: వేసవిని దృష్టిలో ఉంచుకొని యాజమాన్యం ఉపరితల గనుల్లో కార్మికులకు తగిన వసతులు కల్పించాలని ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ కార్యదర్శి అన్‌రెడ్డి సమ్మిరెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఓసీపీ, సీహెచ్‌పీ, ఇందారం ఓసీపీలలో ఉద్యోగులకు చల్లని నీరు, చలువ పందిళ్లు, నిమ్మరసం, మజ్జిగ, కూలర్లు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. లేనిపక్షంలో ఉద్యోగులు అనారోగ్యం పాలై, బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.

ప్రమాదాల నివారణకు ఆధునిక సాంకేతికత



ఆస్ట్రేలియా ప్రతినిధులతో మాట్లాడుతున్న సీఎండీ

శ్రీరాంపూర్, మార్చి 14: భూగర్భ గనుల్లో ప్రమాదాలను ముందస్తుగా వంద శాతం గుర్తించే ఆధునిక సాంకేతికతను వినియోగించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం అన్నారు. గురువారం ఆయన ఆస్ట్రేలియా ప్రతినిధులతో హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సమావేశమయ్యారు. ఆస్ట్రేలియా దేశానికి చెందిన నోమ్ అనే సంస్థ కొత్తగా రూపొందించిన ఆధునిక పరికరాలను ఆయన పరిశీలించారు. భూగర్భ గనుల్లో ఎన్నో రక్షణ చర్యలు తీసుకుంటున్నప్పటికీ అకస్మాత్తుగా పైకప్పు కూలీ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ చర్యలను ఈ యంత్రం ముందస్తుగా గుర్తించి ఫ్లాష్ లైటింగ్ ద్వారా గానీ, సైరన్ ద్వారా గానీ అప్రమత్తం చేస్తుందని పేర్కొన్నారు. దీని వలన ప్రాణనష్టం జరుగకుండా చూడవచ్చన్నారు. నోమ్ సంస్థ ఎండీ నాథన్ ఓవెన్, జీఎం కేసన్ పిన్‌లెన్ తాము రూపొందించిన టెక్నాలజీని డెమో ద్వారా వివరించారు.

అనంతరం డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) జి వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, గతంలోనూ సింగరేణిలో ఇలాంటి సాంకేతికతను వినియోగిస్తున్నామని, అస్ట్రేలియాకు చెందిన కొత్త టెక్నాలజీతో వందశాతం ప్రమాదాల్ని అరికట్టవచ్చని తెలిపారు. అనంతరం జీఎం (ఆర్‌అండ్‌డీ) ఎస్డీఎం సుభాని మాట్లాడుతూ, అస్ట్రేలియా ప్రతినిధుల టెక్నాలజీని తాము పరిశీలించామని, ఉన్నతస్థాయిలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

కొనసాగుతున్న ఉద్యోగాల జాతర

- కొత్తగా 327 ఉద్యోగాలకు నోటిఫికేషన్

శ్రీరాంపూర్, మార్చి 14: సింగరేణిలో ఉద్యోగాల జాతర కొనసాగుతోంది. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్లకు అదనంగా గురువారం సింగరేణి సంస్థ 327ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చింది. కొత్త నోటిఫికేషన్‌లో ఎగ్జిక్యూటివ్ కేడర్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీ (ఈఅండ్‌ఎం) ఈ2 గ్రేడ్ 42పోస్టులు, మేనేజ్‌మెంట్ ట్రైనీ(సిస్టమ్స్) ఈ2గ్రేడ్7 పోస్టులు, నాన్-ఎగ్జిక్యూటివ్ కేడర్‌లో జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీ(జేఎంఈటీ) టీఅండ్‌ఎస్ గ్రేడ్-సీ పోస్టులు100, అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ(మెకానికల్) టీఅండ్‌ఎస్ గ్రేడ్-సీ పోస్టులు 9, అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ(ఎలక్ట్రికల్) టీఅండ్‌ఎస్ గ్రేడ్-సీ పోస్టులు 24, ఫిట్టర్ ట్రైనీ కేటగిరీ-1 పోస్టులు 47, ఎలక్ట్రీషియన్ ట్రైనీ కేటగిరీ-1 పోస్టులు 98ఉన్నాయి. ఆయాపోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 15వ తేదీ మధ్యాహ్నం 12గంటల నుంచి మే 4వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అవకాశం ఉంది. ఈ ఉద్యోగాలకు గరిష్ఠ వయస్సు 30ఏళ్లు కాగా, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు నిబంధనల ప్రకారం ఐదేళ్ల రిలాక్సేషన్ ఉంది. సింగరేణి ఉద్యోగులకు మాత్రం వయస్సు లిమిట్ లేదు.

అభ్యర్థులు వచ్చే నెల 15న మధ్యాహ్నం 12గంటల నుంచి వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవచ్చని సీఎండీ ఎన్ బలరాం ఒక ప్రకటనలో తెలిపారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీఆర్వో లోకేశ్వర్‌రావు

ఆసిఫాబాద్, మార్చి 14: జిల్లాలో పండుగలను మత సామరస్యంతో ప్రశాంతంగా జరుపుకోవాలని డీఆర్వో లోకేశ్వర్‌రావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో డీపీవో భిక్షపతిగౌడ్, డీఎస్పీసదయ్య, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీ కమిషనర్లు భుజంగరావు, అంజయ్యతో కలిసి ముస్లిం మతపెద్దలు, మజీద్‌కమిటీ సభ్యులతో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్‌మాసం ప్రారంభమైనందున మజీద్‌ల వద్ద పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలుచేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జీ మైనార్టీ సంక్షేమాధికారి సజీవన్, తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

భరోస కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎస్పీ

ఆసిఫాబాద్, మార్చి 14: జిల్లాకేంద్రంలోని భరోస కేంద్రాన్ని గురువారం ఎస్పీ కె సురేష్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, పిల్లల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపేవిధంగా ఈకేంద్రం ఏర్పాటు చేశామన్నారు. బాధితులకు సత్వరన్యాయం దిశగా పనిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్పీప్రభాకర్‌రావు, టాస్క్‌ఫోర్స్, డీసీఆర్బీసీఐలు రాణాప్రతాప్, రమేష్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం..కేసు నమోదు

వాంకిడి, మార్చి 14: మండలకేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనీకి చెందిన కొబ్రగడే సంధ్యారాణి(23) అదృశ్యమైనట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొబ్రగడే సంధ్యారాణి మండల కేంద్రంలోని ఓ బట్టలషాపులో పనిచేస్తోంది. బుధవారం ఉదయం 10గంటలకు బట్టల దుఖాణానికి వెళ్లి మధ్యాహ్నం ఇంటికివచ్చి భోజనం చేసింది. తిరిగి సాయంత్రం 4.30గంటలకు బట్టల దుకాణానికి డ్యూటీకివెళ్లి వస్తానని ఇంట్లోచెప్పి వెళ్లింది. రాత్రి ఇంటికి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఎక్కడా ఆచూకీ లభించలేదు. గురువారం సాయంత్రం వరకు ఆచూకీ లభించక పోవడంతో సంధ్యారాణి తల్లి కొబ్రగడే దేవమ్మ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు జరుపు తున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు.